
# ప్రవాహంలో నాచు

వేంపల్లి సికిందర్

దిగంతాల నుంచి ఆకాశమంతా వ్యాపించిన చీకటి నల్లటి పిశాచంలా కనిపిస్తూ ఉంది. ఆ చీకట్లో నవాబు పేట కానుకొని వున్న వాగులేరు ప్రవహిస్తున్న శబ్దం సన్నగా మధురంగా వినిపిస్తూ ఉంది.

గుడిసె ముందర ... తుంగ చాప పైన గుర్రుపెడుతూ నిద్రపోతున్నాడు ఖాదర్ బాషా.




అతనికి కొంత దూరంలో వున్న పాత నులక మంచంమీద మాసిపోయిన చున్నీని దుప్పటిలా కప్పుకొని, చినిగిన సల్వార్ కమీజ్‌లో, కాళ్ళు కడుపులోకి ముడుచుకొని చిగురుటాకులా వణికిపోతూ, నాగులేటి శబ్దం వింటూ పడుకొని వుంది పదహైదేండ్ల సల్మా. రాత్రంతా నిద్రపోవడానికి ప్రయత్నిస్తూ ఉంది. కానీ ఎంతకూ నిద్ర రావడం లేదు.

''రేపు నువ్వు పెందరాళే రా. బూజు దులపాలి. ఇల్లు కడగాలి. చదువు పేరు చెప్పి నిలిచిపోయావనుకో వీపు చీరేస్తాను''

నిన్న పని ముగించే ముందు, మరో పనిమనిషి రాజమ్మ ఎదుట యజమానురాలు అన్న మాటలు ఇంకా చెవుల్లో గీపెడుతూనే ఉన్నాయి.

రాత్రి గడచిపోతోందిగానీ, ఆలోచనలు తెగిపోవడం లేదు. చల్లగా శరీరాన్ని తాకుతున్న ఈదురుగాలి. వెన్నులో వణుకు. సల్మా చున్నీని పక్కకు తీసి కళ్ళు తెరిచింది.

అప్పుడే తూర్పు తెల్లబడుతూ ఉంది.

ఉలిక్కిపడి లేచి 'అప్పుడే తెల్లారుతోందే' అనుకొంటూ గుడిసెవైపు చూసింది.

గుడిసె లోపల పడుకొన్న అమ్మ, తమ్ముళ్లు ఇంకా లేచినట్టు లేదు. నాన్న గుర్రుపెడుతూ ఇంకా నిద్రపోతూనే వున్నాడు.

'ఈ మనిషిదేముంది. అమ్మీజాన్, నేను నాలుగిళ్లలో పనిచేసి తీసుకొస్తే. తింటాడు, తాగుతాడు. వట్టి బాధ్యతలు లేని మనిషి' అనుకొని జారిన జుట్టు ముడికి రబ్బరు బ్యాండు పెట్టుకొంటూ హడావిడిగా బయలుదేరింది సల్మా.

అప్పటికే రాజమ్మ గేటు ముందర నీళ్లు చల్లి ముగ్గు పెడుతోంది. 'హమ్మయ్య బ్రతికిపోయాను. అమ్మగారు యింకా లేవలేదు' అనుకొంటూ గట్టిగా గాలి పీల్చివదులుతూ ఇంటి పెరట్లోకి వెళ్లి, రాత్రి తిని పడేసిన ఎంగిలి

అంట్లు తోమడంలో నిమగ్నమైపోయింది.

రాత్రి ఇంట్లో తన విషయంగా ఓ చిన్నపాటి రణరంగమే జరిగింది. అందుకే రాత్రి భోజనం కూడా చెయ్యలేదు. నీరసంగా ఉంది. కళ్లు తిరుగుతున్నాయి. శరీరంలో నిస్సత్తువ. శక్తినంతా కూడదీసుకొని పళ్ల బిగువుతో పనిచేసుకుపోతూ వుంది.

అంట్లు తోమడం...

ఇంట్లో కసువు చిమ్మడం-

బట్టలుతకడం -

బూజు దులపడం - అయింతర్వాత హాల్లో గచ్చు తుడవసాగింది.

'చాకిరీకి మనుషులను డబ్బిచ్చి కొనుక్కుంటున్నారు. తనలాంటి వారిమీద... సాటి మనిషిగా దయ, జాలి, కరుణ చూపడం వారికనవసరం' సల్మా బాధగా మూలిగింది.

'రౌతు మెత్తనైతే గుర్రం మాట వినదు. పనివాళ్ల మీద జాలి చూపిస్తే పనులు అటకెక్కుతాయి. పెట్టుబడికి ఫలితం దక్కదు' - అని మొన్నటికి మొన్న పక్కింటి ఆంటీతో అమ్మగారు అంటుంటే అన్యమనస్కంగానే విన్నది తను. తనమీద కనికరం అటుంచి అమ్మగారి దగ్గర చీవాట్లు తప్పించుకుంటే అదే పదివేలు అనుకుంటూ దగ్గరవుతున్న అడుగుల చప్పుడుకు తలెత్తి చూసింది.

యజమానురాలు క్రిష్ణవేణమ్మ, చీర చుట్టుకున్న తెల్ల ఏనుగులా తనవేపు వస్తూ కనిపించింది.

చూపులు కలపకూడదు. నేరుగా చూడకూడదు. అది ఆవిడకు నచ్చదు. అందుకని చప్పున తల దించేసుకుని పనిలో నిమగ్నమైపోయింది - ఆవుకు గడ్డి పడేసినట్టుగా.

చద్దన్నం - కూర - పులుసు - అన్నీ కలిపిన గిన్నెను క్రిష్ణవేణమ్మ సల్మా పక్కన గిరాటేసి వెళ్లిపోయింది.

గబుక్కున గిన్నెనెత్తుకొని పెరడులోకి వెళ్లి బట్టలుతికే తిన్నెమీద కూచొని, గిన్నెలో అన్నీ మరింతగా కలగలుపుకొని ఆత్రంగా తినసాగింది. ఎక్కిళ్లు రాసాగాయి. ఒకచేత్తో గిన్నెను పట్టుకొనే లేచివెళ్లి పంపు దగ్గర నీళ్లు తాగింది. ఆ తరువాత మొత్తం తినేసి ఆపై మళ్లీ కడుపారా నీళ్లు తాగి కాస్త కుదుట పడింది.

అలసిన శరీరం శక్తిని పుంజుకొంది.

పంపునీళ్లతో ముఖం కడుక్కుని చున్నీతో శుభ్రంగా తుడుచుకొని ఇంటికి బయలుదేరింది. ఇంట్లో పుస్తకాల సంచీ భుజాన వేసుకొని స్కూలు వైపు నడిచింది.

ఆమె మెదడు నిండా ఆలోచనలే... వాటితో సల్మా హృదయం ఒక యుద్ధరంగమే అయింది.

***

స్కూలు చేరుకొనేసరికి బాగా ఆలస్యమైంది. ప్రేయరు అయిపోయి క్లాసులు మొదలైనట్టున్నాయి. ఇవాళ లేట్‌కమర్స్ చాలామంది వున్నట్టున్నారు. ఒకరి తర్వాత ఒకరికి వరుసగా బెత్తంతో పూజచేసి ఆపైన వాళ్లని మోకాళ్లమీద నిలబెట్టిస్తూ వుంది పి.యి.టి. మేడమ్ అనిత.

బెరుకు బెరుగ్గా దగ్గరకొస్తున్న సల్మాని కరుగ్గా చూస్తూ తిట్లదండకం మొదలెట్టింది.

''రికానా లేని ముం.... లు.. చదువుపై ధ్యాస, శ్రద్ధ లేదు. చదువుకొని మంచిగా బతకాలన్న ఇంగిత జ్ఞానం అస్సలు లేదు''

మాటలు ములుకుల్లా చెవుల్ని తాకుతున్నాయి.

భయంతో బాధతో పి.ఇ.టి. మేడమ్‌ను సమీపించి అరచేయి చాపింది సల్మా. బలంగా తాకిన బెత్తం దెబ్బకు చేయి నొప్పెడుతున్నా మౌనంగానే భరించింది.

అనిత మేడమ్‌కు వచ్చిన కోపం ఇంకా తగ్గినట్టు లేదు తనవేపే కొరకొరా చూస్తూ 'మోకాళ్లపైన నిలబడు.. పో' ఆర్డరేసింది. దాంతో దెబ్బతిన్న లేడిపిల్లలా వంగి వణుకుతూ మోకాళ్లమీద నిలబడింది సల్మా.

అరగంట తర్వాత లేట్‌కమర్స్‌నందరినీ లేవనిచ్చారు. ఆలస్యంగా రాకూడదని, వస్తే ఈమారు మరింత పెద్ద పనిష్మెంట్ వుంటుందని గట్టిగా హెచ్చరించారు ఎ.హెచ్.ఎమ్. కుసుమ మేడమ్. బ్రతుకుజీవుడా అనుకుంటూ వాళ్లవాళ్ల క్లాసులకేసి పరుగుతీశారు లేట్‌కమర్స్. తనూ లేచి క్లాసుకేసి నడిచింది సల్మా.

ఫస్ట్ అవర్ పూర్తయినట్టుంది. క్లాసు నుంచి వెలుపలికి వస్తూ కనిపించారు లెక్కల మాస్టారు ఆనందరావుగారు.

క్లాసులోకి వెళ్లి బెంచీమీద కూర్చుని డెస్కులో పుస్తకాల సంచీ పెట్టింది సల్మా. రెండో పీరియడ్ సైన్స్. విజయ మేడమ్ ఆవాళ సెలవట తోటిపిల్లలు అనుకొంటుంటే వింది. లీజర్ చిక్కింది.

శరీరానికి కాస్త రిలీఫ్ కలిగింది కానీ మనసుకు శాంతి లేదు. భావి జీవితంపై ముసురుకోబోతున్న భయాందోళనలు కందిరీగల్లాగా రొదపెడుతూ మెదడును తొలిచేస్తున్నాయి. గుండెలో బాధలు సుడులు తిరుగుతున్నాయి. కళ్లు మూసుకుని బాధగా గోడకానుకుంది సల్మా.

'రౌతు మెత్తనైతే గుర్రం మాట వినదు. పనివాళ్ల మీద జాలి చూపిస్తే పనులు అటకెక్కుతాయి. పెట్టుబడికి ఫలితం దక్కదు' - అని మొన్నటికి మొన్న పక్కింటి ఆంటీతో అమ్మగారు అంటుంటే అన్యమనస్కంగానే విన్నది తను. తనమీద కనికరం అటుంచి అమ్మగారి దగ్గర చీవాట్లు తప్పించుకుంటే అదే పదివేలు అనుకుంటూ దగ్గరవుతున్న అడుగుల చప్పుడుకు తలెత్తి చూసింది.

***

''ఏమిటో విశేషాలు''

''విశేషాలు అంటూ ఏముంటాయ్ మన స్కూల్లో''

''అయితే అన్నీ సశేషాలేనంటావ్?''

నవ్వుతూ అంది హెడ్మిస్ట్రెస్ లావణ్య పి.ఇ.టి. అనితతో.

ఇద్దరిదీ ఒకే కులం. బంధుత్వం కూడా వుంది. చనువుగా మాట్లాడుకొంటున్నారు. అనిత డ్యూటీ కన్నా సూల్లో అందరి విషయాలు తెలుసుకొని హెచ్.ఎం. దగ్గర చెప్పడమే ప్రధానమనుకొనే మనిషి. ఆమె మోసుకొచ్చిన విషయాలపైన జరిగే చర్చలు, ఉపచర్చలపై ఆధారపడే అక్కడి అడ్మినిస్ట్రేషన్ వుంటుంది.

స్పెషలు ఫీజు విషయాలు, అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాలు, స్కూలుకు సంబంధించిన ఏ విషయమైనా హెచ్.ఎం. ఆమోదముద్రల వరకే పరిమితం. తతిమ్మా విషయాలన్నీ అనితగారే చూసుకొంటూ ఓ కొలిక్కి తెస్తారు.

ఇంటర్నల్ పాలిటిక్స్ విషయం అలా వుంచితే, హెచ్ఎం లావణ్య గారికి స్కూలు పిల్లలంటే చాలా మక్కువ. స్కూలును అన్నివిధాల అభివృద్ధిపరచాలన్న కోరిక బలంగా గల మనిషి. విద్యార్థుల అభివృద్ధి కోరుకునే వ్యక్తి. స్కూలునే కాదు టీచర్లనూ బాగా కంట్రోల్ చెయ్యగల నేర్పరి.

చక్కగా చదివే పిల్లలని ప్రోత్సహిస్తారు. చదువుల్లో వెనకబడిపోతున్న పిల్లల్ని గుర్తించి, చేరదీసి ఫ్రీగా ఇంట్లో స్వయంగా ట్యూషను చెబుతుంది. అపుడపుడు సల్మా కూడా ఆవిడ దగ్గర ట్యూషనుకు వస్తూ వుంటుంది.

''అనితా... ఇంతకూ సశేషాలేమిటో చెప్పనేలేదు'' రిపీట్ చేసింది హెచ్ఎం లావణ్య.

''చెబుతా. చెబుతా. కాస్త ఆగు. ఏమిటా తొందర'' అంటూ మూతి వంకరగా తిప్పుతూ నవ్వింది లావణ్య.

''టీచర్ల విషయం షరా మామూలే. కాని?'' అంటూ అర్థోక్తిగా ఆగింది అనిత.

''ఆ... కాని ఏమిటో కాస్త వివరంగా చెప్పరాదు'' అభ్యర్థించింది లావణ్య.

''అదే... సల్మా''

''దానికేమొచ్చింది. పేద ముండ. బాగానే చదువుకొంటూ వుందే. పైగా చదువంటే దానికి ప్రాణమే.''


''నిజమే కాని, దాని ధోరణిలో ఈమధ్య బాగా మార్పు కనబడుతూ వుంది''

''ఏమిటా మార్పు. కాస్త వివరంగా చెప్పు''

''ఇంతకుముందు దానికాత్మాభిమానం వుండేది. ఎవరేమి ఇయ్యజూపినా ముట్టుకొనేది కాదు''

''నిజమే. మరిపుడు''

''ఎవ్వరేమిచ్చినా తీసుకొంటూ వుంది. తినే వస్తువులు ఇవ్వజూపినపుడు గుంచుకున్నట్టుగా లాక్కొని - ఆబగా తినేస్తూ వుంది. ఉన్నట్టుండి పిచ్చి చూపులు చూస్తూ పరధ్యానంలో మునిగిపోతూ వుంది. మొత్తానికి దాని ప్రవర్తన విచిత్రంగా




వుంది.''

''ఎట్లా?''

''సాయంత్రం స్కూలు వదిలిపెట్టాక, ఇంటికెళ్ళకుండా రాత్రయినా స్కూలు కాంపౌండులోనే తచ్చాడుతూ వుంటోందట. చూసిన వాచ్‌మెన్ చెప్పాడు''

''ఇంకా?''

''నిన్న రాత్రి వాచ్‌మెన్ మందలించి బలవంతాన పంపాకగాని వెళ్లలేదట''

''అవునా? పేదపిల్లయినా ఆటపాటల్లో చలాకీగా వుండేది. నా దగ్గర ట్యూషన్ తీసుకున్నాక బిలో యావరేజ్ నుంచి అబౌ యావరేజికి వచ్చేసింది. చాలా ఉత్సాహవంతురాలు... పాపం...''

''ఆ ఉత్సాహం తనలో ఇపుడు లేదు''

''అలాగా? విషయమేమిటో కనుక్కోవాల్సింది?''

'ప్రయత్నించాను, ప్రయోజనం లేకపోయింది''

''ఎందుకని''

''కొట్టినా కోసినా నోరు మెదపడంలేదు. మూగనోము పట్టింది''

''అలాగా?'' అంటూ కాలింగ్‌బెల్ నొక్కింది లావణ్య.

పరుగున వచ్చి వినయంగా వంగి 'అమ్మా' అన్నాడు అటెండర్.

''వెళ్లి సల్మాను పిలుచుకు రావయ్యా'' పురమాయించి పంపింది. అలాగే అని వెళ్లి సల్మాను పిలుచుకువచ్చాడు చాంబర్లోకి.

భయంతో అయోమయంగా నిలబడ్డ సల్మా వంక పరిశీలనగా చూసింది లావణ్య. పిల్ల సలక్షణంగా వుంది.

రంగు కనుముక్కు తీరు భేషుగ్గా ఉన్నాయి.

మాసిన బట్టలు.. మట్టిగొట్టుకుపోయిన శరీరం. కేశ సంస్కారానికి నోచుకోని జుట్టు. పాలిన చెక్కిళ్లు. నీరసపడ్డ దేహం. మబ్బుల్లో చందమామలా వుంది. చూసినకొద్దీ జాలి కలుగుతోంది అనుకుంటూ –

''సల్మా ఏమయిందే నీకు. ఎందుకలా వున్నావు'' అని అడిగింది.

ఆ మాటలతో సల్మా హృదయంలో ఘనీభూతమైన గత ఖేదం బద్దలైంది. అయినా దుఃఖంతో పూడుకుపోయిన సల్మా గొంతులోంచి మాట పెగల్లేదు ఎంతకూ మౌనం వీడనందుకు లావణ్యకు కోపం వచ్చింది.

విషయం చెప్పి తీరాలన్నట్టుగా గట్టిగా రెట్టించి స్వరం పెంచి మరీ ''విషయమేమిటో చెప్పు'' అంది.

ఇక తప్పదన్నట్టుగా మెల్లిగా తలెత్తింది సల్మా.

లావణ్యవేపు ఒకసారి చూసింది. ఆ చూపుల్లో గుండెను కోసే దీనత్వం. ఆ చూపువెంట చెక్కిళ్లను తడుపుతూ జారిన రెండు కన్నీటి చుక్కలు.

చలించిపోయింది లావణ్య. అనితా మేడం చూస్తూనే వుంది.

''ఏమయ్యిందే తల్లీ. నీకేం భయం లేదు చెప్పు'' మెల్లిమెల్లిగా అనునయిస్తూ అడిగింది లావణ్య.

ఇక సల్మా మౌనం వీడక తప్పింది కాదు.

''మేడమ్ ఇంటి దగ్గర నా చేత అన్నిపనులు చేయించుకుంటున్నారు''

''ఓ... అది. తప్పేముంది''

''అదికాదు మేడమ్. చెప్పినవన్నీ చేసిపెడుతున్నా 'గుండెల మీద కుంపటిలా కూచున్నావ్ కదే! యెదవ ముండా' అంటూ నోటికి వచ్చినట్టు తిట్టిపోస్తున్నారు.

''కని పెంచి, పోషిస్తున్న వాళ్లకు బిడ్డల మీద అన్ని హక్కులూ వుంటాయ్. వాళ్లేమన్నా వినాలి కదా!''

''ఒకటికి రెండిళ్లలో పాచిపనికి పెట్టారు''

''వాళ్ల ఆర్థిక స్తోమత అలాంటిది. వేన్నీళ్లకు చన్నీళ్లు తోడన్నట్టుగా వాళ్లు నిన్ను పనికి పెట్టి ఉండవచ్చు'' అంతా వింటున్న అనిత కల్పించుకొంటూ మధ్యలో అంది.

''పనికి నేనెప్పుడూ వెనుకాడలేదు మేడమ్. ఓపిగ్గా పనిచేసి అక్కడ వచ్చే డబ్బులూ, బట్టలూ, అన్నీ తెచ్చి ఇంట్లో ఇచ్చేస్తున్నాను''.

''మంచిదే. ఇంకేం మాయరోగం. అలా వున్నావ్?'' విసుగ్గా అంది లావణ్య.

ఎప్పుడూ విద్యార్థినులతో సౌమ్యంగా మాట్లాడే లావణ్య అలా విసుగ్గా అనేసరికి భోరున ఏడ్చింది సల్మా. ఆమె ఏడుపు చూసి కరిగిపోయి, ఏమీ అర్థం కాక ఒకరి మొహాలొకరు చూసుకొన్నారు అనిత, లావణ్యలు.

లావణ్య – ''ఇలా రామ్మా'' అని సల్మాను దగ్గరకు పిలిచి, చేత్తో తల నిమురుతూ – ''నీకేం భయంలేదు. నీ బాధేమిటో నాకు చెప్పు? ఎవరైనా మాస్టర్లు నిన్నేమన్నా అన్నారా?'' అనునయంగా అడిగింది.

''మావాళ్ళు నన్ను దుబాయి షేకుకిచ్చి 'నిఖా' జరిపించాలని అనుకొంటున్నారు మేడమ్'' ఏడుస్తూ చెప్పింది సల్మా.

ఆ మాట వినగానే పిడుగు పడ్డట్టయింది లావణ్యకు.

''నువ్వు నిజమే చెబుతున్నావా?'' ఆశ్చర్యంగా అడిగింది అనిత మేడం.

''మా అబ్బాజాన్ బ్రోకరుతో మాట్లాడుకొంటుంటే చాటుగా అంతా విన్నాను''

''నిజమా'' నమ్మలేనట్టు మరోసారి అడిగింది లావణ్య.

''నిజమే మేడమ్. వచ్చే శుక్రవారం, జుమ్మా నమాజు అయినాక హైదరాబాదులో నా నిఖా జరిపించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. బేస్తవారమే నన్ను హైద్రాబాదు తీసుకెళతారట'' వెక్కిళ్ల మధ్య దుఃఖిస్తూ చెప్పింది సల్మా.

''ఇంక రెండు నెలలుంటే టెన్త్ అయిపోతుంది. ఇంతలో ఏమిటీ ఘోరం'' తనకు తాను మాట్లాడుకుంటున్నట్టుగా అంది అనిత.

లావణ్యకు ఏం చెప్పాలో, ఏం చెయ్యాలో పాలుపోలేదు.

''నాకు నిఖా వద్దు మేడం. చదువుకోవాలని వుంది'' తలొంచుకుని నేలచూపులు చూస్తూ అంది సల్మా.

'చదువుకొని ఉద్యోగం సంపాదిస్తే బిడ్డ వాళ్లవాళ్లకు ఆసరాగా వుంటుంది. మగపిల్లలకంటే ఆడపిల్లలకే కన్నవాళ్ల మీద మమకారం ఎక్కువుంటుంటారు. ఈ విషయాన్ని సల్మా తల్లిదండ్రులు ఎందుకు తెలుసుకోరు. నిఖా పేరుతో దుబాయి షేకులు ఇండియన్ అమ్మాయిలను అక్కడికి తీసుకెళ్లి అనుభవించి మరీ వ్యభిచారంలోకి దించుతారు. ఇలాంటి ఉదంతాలు ఎన్నెన్ని పేపర్లలో చదవడంలేదు. ఈ విషయం తెలిసీ దుబాయి షేకుతో సల్మా నిఖా చేయాలనుకుంటున్నారంటే ఏమనుకోవాలి?' తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చింది లావణ్య.

అటెండర్ని పిలిచి ''నవాబ్‌పేటకెళ్లి ఖాదర్‌బాయిని పిలుచుకురా పో! ఖాదర్‌బాయి అంటే ...

ఖాదర్ బాషా. ఎవరో తెలుసుగా'' అంది లావణ్య.

''ఎందుకు తెలీదు మేడం. సల్మా వాళ్ల నాయన'' అంటూ అక్కడినుంచి వెళ్లాడు అటెండర్.

''సరే సల్మా, నువ్వేమీ దిగులుపడవద్దు. మీ నాయనతో నేను మాట్లాడతాను. వెళ్లు. బాగా చదువుకో'' అని లావణ్య అనడంతో సల్మా ముఖంలో సంతోషం విచ్చుకుంది.

''అలాగే మేడం'' అంటూ వెళ్ళబోతున్న సల్మాతో - ఏదో ఆలోచన వచ్చి తల పంకిస్తూ -

''ఇదిగో... ఇంక నువ్వు మీ యింటికి పోవద్దు. మా యింటికాడనే వుండిపో. మీవాళ్లకు నేను చెబుతాన్లే'' అంది లావణ్య.

సల్మా ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయి తేలికపడిన మనసుతో అక్కడినుంచి వెళ్లిపోయింది.

'నాకు క్లాసు వుంది' అంటూ పిఇటి అనిత కూడా అక్కడినుంచి వచ్చేసింది. వాళ్లిద్దరూ చాంబర్ నుంచి వెళ్లిన కాసేపటికి ఖాదర్ బాయిని వెంటపెట్టుకొని వచ్చాడు అటెండర్.

''ఖాదర్‌బాయి కూర్చో'' అతన్ని చూడగానే ఎదురుగా వున్న కుర్చీ చూపించింది.

''ఫర్వాలేదు మేడం'' చేతులు కట్టుకొని వినయంగా చెప్పాడు ఖాదర్ భాషా.

ఎలా మొదలుపెట్టాలో తేలిక లావణ్య-''పద్దెనిమిదేళ్లు నిండని ఆడపిల్లకు పెళ్లి చేయకూడదు. అది చట్టరీత్యా నేరం. తెలుసా?'' అంది.

ఈమెకు సల్మా విషయం తెలిసిపోయినట్టుందే అని మనసులో అనుకుంటూ ఒక్క క్షణం షాక్ తిన్నాడు ఖాదర్‌భాషా.

మేడం ముఖంలోకి సూటిగా చూడలేక గిల్టీ కాన్షియస్‌తో మౌనంగా తలొంచుకున్నాడు.

''సల్మాకు చదువంటే ఇష్టం. రెండిళ్లలో పాచిపని చేస్తూ కూడా స్కూలుకు వచ్చి చదువుకుంటూ వుంది. అలాంటి అమ్మాయికి దుబాయి షేకుతో పెళ్లి ఏమిటి? తెలిసీ తెలియని వయసులో ఆ అమ్మాయి గొంతు కొయ్యకు. రేపటి నుంచి సల్మా మా యింటిలోనే వుండి చదువుకుంటుందిలే. పెళ్లి ప్రయత్నాలు మానెయ్యండి'' చెప్పదలచుకున్న నాలుగు మాటలు చెప్పేసింది.

ఖాదర్ 'సరే మేడం' అంటూ అయిష్టంగానే అక్కడి నుంచి బయలుదేరాడు. ఓ పట్టాన ఒప్పుకోడని భావించిన లావణ్య - అతను మారుమాట్లాడకుండా వెళ్లిపోతుండడంతో హాయిగా గాలి పీల్చుకుంటూ అతను వెళ్లినవైపే చూస్తూ వుండిపోయింది.

***

నాలుగు రోజుల తర్వాత...

'ఏమిటీ అమ్మాయి. ఇంటికెళ్లి వస్తాను మేడం. అమ్మీజాను గుర్తుకొస్తూ వుంది అని చెప్పి వెళ్లి రెండు రోజులయింది. ఈవేళకు అతీగతీ లేదు' ఆలోచించుకుంటూ ఆసాయంత్రం వేళ వ్యాహ్యాళికి నడుచుకుంటూ వెళ్లి ఏటిగట్టున కూచుని వుంది లావణ్య.

ఏటిలో నీళ్లు నిర్మలంగా ప్రవహిస్తున్నాయి. నీటిమీద నాచు తెప్పలు తెప్పలుగా కదులుతూ ముందుకెళుతోంది.

''మేడమ్ మీరిక్కడున్నారా'' మాట వినవచ్చినవైపు తలెత్తి చూసింది లావణ్య. ఆయాసంతో రొప్పుతూ నిలబడి వుంది అనిత. ఆ వాలకం చూసి - దీనికెక్కడి వార్తలూ చాలవు. ఏదో ముఖ్యమైన వార్త మోసుకొచ్చే వుంటుంది. ఏమిటా వార్త? అనుకుంటూ విషయమేమిటన్నట్లుగా అనిత ముఖంలోకి చూసింది లావణ్య.

''ఈ మాట విన్నారా?''

వస్తున్న ఆయాసాన్ని కంట్రోల్ చేసుకుంటూ అంది అనిత. దానికి ఏమిటన్నట్టుగా అయోమయంగా చూసింది లావణ్య అనిత వంక.

''నేను నవాబుపేట మీదుగా స్కూలుకు వస్తూ ఖాదర్ బాషా ఇంటి దగ్గర ఆగాను. సల్మా రెండు రోజులుగా స్కూలుకు రావడం లేదు కదా? ఏమైందో కనుక్కుందామని చూస్తే... గుడిసెకు బీగం కనిపించింది. పక్కింట్లో అడిగితే అసలు విషయం తెలిసింది'' అంది అనిత.

''అసలు విషయమా? ఏమిటి?''

''అదే మేడమ్. మనం ఏదయితే జరక్కూడదని అనుకొన్నామో అదే జరిగిపోయింది.''

''నీ సస్పెన్సు పాడుగాను. విషయం చెప్పవే ముందు''

''ఖాదర్ బాషా అన్నంతపనీ చేశాడు''.

''ఏం చేశాడు''

''మీరు ఎంత చెప్పినా వినకుండా సల్మాని దుబాయి షేకుకిచ్చి ఇఖా చెయ్యడానికి హైద్రాబాదు తీసుకెళ్లిపోయాడట.''

చావు కబురు చెప్పినట్లుగా చల్లగా చెప్పింది అనిత.

''ఛత్'' అంటూ తల పట్టుకొని ఏటివైపు చూసింది లావణ్య.

సరిగ్గా అప్పుడే నీటి ప్రవాహంలో సుడులు తిరుగుతున్న నాచు ముక్క ఒకటి వేగంగా కొట్టుకుపోతూ కనిపించింది.

నిస్సహాయంగా నిలబడి దాన్నే చూస్తూ వుండిపోయింది లావణ్య.

## అన్నాడం ఏనాడో తెలా?



**ధూ**మ్‌తో దశ తిరిగిన ఈషాడియోల్ ఇక ఆగదలచుకోవడం లేదు. ఉత్తుత్తి ఫాల్తు సినిమాలు చేయండం వేస్ట్ ఆఫ్ టైం అని గట్టిగా నిర్ణయించుకుంది. స్వీట్ గాళ్ ఇమేజ్ నుంచి సెక్సీ బొమ్మ వేషాలు పట్టుకుంది. ఉన్నపళాన ఇదిగో ఇలా దర్శనమిచ్చేసింది. అడెడెడె.. ఇదంతా మీ అమ్మకు తెలుసా? అని అన్నారంటే దుమ్ము దులిపిపారేస్తుంది. 'నేను ఈ కాలం దాన్ని. ఆ కాలంనాటి మా అమ్మలా కన్పించాలంటే కుదుర్దు. కాలంతో పాటు మనుషులు మారాలి. కట్టూ మారాలి. తెలుసా?' అంటూ క్లాసు లాగుతుంది. ఆంఖీ అనే తన రాబోయే సినిమాలో ఇలా కన్పించడానికి కారణం ఆ పాత్ర అలాంటిది అంటూ రొటీన్ డైలాగ్ కొడుతోంది. అలా అని సిగ్గు బిడియం లేకుండా ఫోటోలు దిగిందనుకుంటున్నారా? పాపం! చాలాపాట్లే పడిందట. ''అవునండీ. అప్పుడు షూటింగ్ లో ఎవర్నీ వుండనీయలేదు. అందర్నీ బైటకి తోసేశా. ఎటొచ్చీ ఫోటోగ్రాఫర్ తప్ప'' అంటుంది. అక్కడంటే అందర్నీ తరిమేసింది. సంతోషం. థియేటర్‌లో సినిమా చూస్తున్న ప్రేక్షకులనేం చేస్తుందట? కళ్లకి గంతలు కడ్తుందా? చూద్దాం ఇషా సెక్సీ ఫిగర్ ఎలా వుంటుందో!..